క్లుప్తంగా

వైద్యకళాశాల ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోస్పాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల మెడికల్ కళాశాలలోని మహిళా ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక ఆ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అధ్యాపక సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పని చేసే మహిళా ఉద్యోగులకు థైరాయిడ్, లిక్విడ్ ప్రొఫైల్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమాజంలో మహిళలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్లు కళావతి, బాలీశ్వరి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌వలి ఉరుసు



మస్తాన్‌వలి స్వామికి గంధం సమర్పిస్తున్న భక్తులు

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామం దర్గాలో కొలువైన హజరత్ మస్తాన్‌వలి ఉరుసును గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులంతా పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి గంధం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు,న్యాయవాది రమేష్‌చౌదరి, దర్గా ధర్మకర్త పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పురస్కారాలు ప్రదానం

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు ఈనెల 8వ తేదీన పురస్కారాలు అందజేయనున్నట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ విజయకుమారి, ఇంజినీర్, ప్రముఖ కవయిత్రి వెంకటేశ్వరిని పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

9న ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన పట్టణంలోని శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్ కబడ్డీ బాలురు, బాలికలు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 30-03- 2009 తర్వాత జన్మించి, 55 కేజీల్లోపు బరువు ఉండాలన్నారు. క్రీడాకారులు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో తీసుకొని రా వాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 14వ తేదీ నుంచి 16వ తేదీ వర కు కడప జిల్లా పులివెందుల వైఎస్సార్ స్టేడియ ంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సు.దాకర్, మున్నాబాషా, సుబ్రహ్మణ్యం, నాగరాజు,శివలింగమయ్య, సురేష్‌నాయుడు, మారెళ్ల నాగరాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో కూలీల హాజరు నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఈజీపీఆర్‌డీ

ఉయ్యాలవాడ : ఇక నుంచి పనిప్రదేశంలోనే ఉపాధి కూలీల హాజరు నమోదును ఆన్‌లైన్లో చేపట్టనున్నట్లు మేట్స్ కోర్స్ డైరెక్టర్ పరమేశ్వరుడు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేటీలు, బాధ్యతలు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిలో ప్రతి గ్రూపులో 50 మందికి ఒకరు మేటీ ఉంటారన్నారు. ఎన్ఎమ్ఎమ్ఎస్ యాప్ నమోదుపై క్లుప్తంగా మేటీలకు శిక్షణ ఇచ్చారు. ఏపీఓ రవి ప్రకాష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ టెక్నీషియన్ కోర్సుకు ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో అసిస్టెంట్ టెక్నీషియన్ (కంప్యూటర్ హార్డ్‌వేర్) కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత తెలిపారు. 10వ తరగతి ఆపై చదివిన అభ్యర్థులు tinyur .com/fdc bpl వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పా రు. ఎంపికైన అభ్యర్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 రోజు ల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

చూసిన కనులదే భాగ్యం



ధ్వజారోహణ కార్యక్రమాలకు వస్తున్న ఉత్సవ మూర్తులు

- వైభవంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
- ఎగువ అహోబిలంలో హంసవాహనం, సూర్యప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన జ్వాలానరసింహుడు
- దిగువ అహోబిలంలో సింహవాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజైన గురువారం ఉదయం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలానృసింహ స్వామి హంస వాహనం పై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించగా, రాత్రి సూర్యప్రభ వాహనంపై సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. నిత్య పూజల అనంతరం స్వామిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వివిధ పుష్పాలంకరణ గావించిన హంస వాహనముపై జ్వాలనరసింహ స్వామిని కొలువుంచి భక్తజనం మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో దర్శనార్థం కొలువుంచారు. తిరిగి రాత్రి స్వామి సూర్యప్రభ వాహనాన్ని అధిష్టించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు .

సింహ వాహనాధీశా.. నమో నారసింహా..

దిగువ అహోబిలంలో గురువారం శ్రీ ప్రహ్లాదవరద స్వామి సింహవాహనం పై కొలువై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తజనులకు కనువిందు చేశారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి విశేషంగా అలంకరించిన సింహ వాహనం అధిరోహించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.



అద్దాల మండపంలో భేరీ మోగిస్తూ దేవతలను ఆహ్వానిస్తున్న అర్చకులు



ఎగువ అహోబిలంలో సూర్యప్రభ వాహనం అధిష్టించిన జ్వాలానరసింహస్వామి



సింహవాహనంపై కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు



రాజమండ్రి బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శన

మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ రాజకుమారి



మహిళలను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: మహిళల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల ప్రదర్శన, విక్రయ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో వారం రోజుల పాటు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆడబిడ్డ పుట్టిన వెంటనే ఒక మొక్క నాటడం లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. సమస్యల్లో ఉన్న మహిళలకు అండగా నిలిచి ఆర్థికంగా ఎదిగేందుకు చేయూత ఇవ్వాలన్నారు. పట్టణంలోని మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా మరి కొంతమంది మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతి, పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మెప్మా పీడీ నాగ శివలీల తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత లక్ష్యాలపై దృష్టి పెట్టండి

మహిళా సాధికారతే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల లక్ష్యసాధనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో డీఆర్‌డీఏ ద్వారా అమలయ్యే కార్యక్రమాల ప్రగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన లఖ్‌పతి దీదీ, డ్రోన్ దీదీ లాంటి కార్యక్రమాల్లో ఎట్టి పరిస్థితుల్లో వెనుకంజలో ఉండకూడదన్నారు. బ్యాంక్ లింకేజ్, లఖ్ పతిదీదీ కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యంలో ప్రగతి తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏదైతే రుణం తీసుకుంటారో తిరిగి చెల్లించిన మొత్తాన్ని బుక్ కీపర్స్ సజావుగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 8వ తేదీన కోర్టు ఆవరణలో నిర్వహించే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడో అదనపు జిల్లా జడ్జి వాసు పేర్కొన్నారు. గురువారం కోర్టు ఆవరణలో మాట్లాడుతూ న్యాయవాదులు రాజీ అయ్యే కేసులను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎక్సైజ్, పెట్టి, కుటుంబ కలహాలు, ఎంసీ కేసులను లోక్ అదాలత్‌తో పరిష్కరించుకోవచ్చన్నారు కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజగోపాల్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, భూపని వెంకటేశ్వర్లు, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యల పరిష్కారానికి పోరాటం



రుద్రవరంలో సమావేశమైన వీఓఏలు

రుద్రవరం: వీఓఏల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేయనున్నట్లు వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీ నరసింహులు అన్నారు. మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట సమీపంలో ఉన్న గుర్రప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం వీఓఏల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వీఓఏల మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, గౌరవ వేతనం వారి అకౌంట్లలోనే జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురుస్వామి, సుభాష్, మరియమ్మ, లక్ష్మీదేవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ పనితీరుపై తనిఖీ



రుద్రవరంలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రుద్రవరం:స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కెరీర్ మానసిక కౌన్సిలర్ పనితీరుపై గురువారం జీసీడీఓ నాగసువర్చల, రాష్ట్ర పీఎంయూ కోఆర్డినేటర్ డాక్టర్ ఛా యేంద్ర కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9,10 తరగతుల విద్యార్థులకు కెరీర్, మానసిక ఆరోగ్య స్థితుల గురించి తెలియజేసేందుకు ఎస్ఎస్ఏ తరఫున ముగ్గురు కౌన్సిలర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వీరరాఘవయ్య, లక్ష్మి,హెచ్ఎం సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి ఫైర్‌స్టేషన్ తరలింపు

- బోసిపోయిన సున్నిపెంట కార్యాలయం



శ్రీశైలం దేవస్థానంలో ఏర్పాటైన ఫైర్‌స్టేషన్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ఫైర్‌స్టేషన్‌ను అధికారులు శ్రీశైలం దేవస్థానానికి తరలించారు. 1964 మార్చి10న సున్నిపెంటలో సుమారు 1.5 ఎకరాల స్థలంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఒక ఫైర్ అధికారితో పాటు 18 మంది సిబ్బందిని నియమించారు. ఫైర్‌అధికారి నివాసాన్ని కూడా జలవనరుల శాఖ నిర్మించింది. సున్నిపెంటలో సుమారు 40 వేలు, లింగాలగట్టులో 6 వేలు, శ్రీశైలంలో 7 వేల జనాభా చొప్పున నివశిస్తున్నారు. సున్నిపెంట అటు శ్రీశైలానికి ఇటు లింగాలగట్టుకు మధ్య ఉంది. ఎక్కడ అగ్నిప్రమాదం, విపత్తు జరిగినా కొద్ది సమయంలోనే ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టే వీలుంది. జాతీయ ప్రాజెక్టులు శ్రీశైలం డ్యాం , కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం, 11కెవి స్విచ్‌యార్డులు కూడా సున్నిపెంట పరిసరాలల్లోనే ఉన్నాయి. ఈ ప్రాజెక్టులలో ఏదైనా ప్రమాదం జరిగితే రూ.కోట్లలో నష్టం ఉంటుంది. అలాగే సున్నిపెంటలో హెలిప్యాడ్ కూడా ఉంది. రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, వ్యాపార దిగ్గజాలు, సినీతారలు ఇలా ఎందరో హెలికాప్టర్లలో తరచూ శ్రీశైలం వస్తూ సున్నిపెంటలో ల్యాండ్ అవుతుంటారు. హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా రక్షణగా ఫైర్‌వాహనంతో పాటు, సిబ్బంది హాజరవుతుంటారు. ఇప్పుడు ఫైర్ స్టేషన్‌ను శ్రీశైలంలో ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రద్దీ, ఘాట్‌రోడ్ దృష్ట్యా లింగాలగట్టుకు చేరాలంటే కనీసం గంట సమయం పడుతుంది. అయినప్పటికీ ఇంతటి అవసరాలు ఉన్నా ఫైర్‌స్టేషన్‌ను తరలించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

జగజ్జననీ మాతకు జలాభిషేకం



అమ్మవారికి జలం తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో జగజ్జననీ ఆల య వార్షికోత్సవాలను పురస్కరించుకొని గురువారం మొదటి రోజు అమ్మవారికి జలాభిషేకం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు వందలాది మంది భక్త లు ఇంటి వద్ద నుంచి తీసుకొని వచ్చిన జలంతో శాస్త్రోక్తంగా జలాభిషేకం నిర్వహించారు. తర్వాత పట్టువస్త్రాలతో అలకరింపజేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అగ్ని ప్రతిష్టాపన దీక్షా హోమం, ప్రదోష కాల పూజలు నిర్వహించారు. శ్రీదుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. నిర్వాహకులు పుల్లయ్య మాట్లాడుతూ రెండో రోజు శుక్రవారం జగజ్జననీ అమ్మవారికి ఆవుపాలతో కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాండురంగస్వామి వార్షిక మహోత్సవాలు ప్రారంభం



కొలువైన రుక్మిణిసమేత పాండురంగస్వామి

నంద్యాల(అర్బన్): పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణి సమేత పాండురంగస్వామి వార్షిక మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పంచగవ్య మేళం, సంప్రోక్షణాలు నిర్వహించారు. వేదపండితులు ఆదినారాయణశర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో మూలమంత్ర అనుష్టానములు, అభిషేకాలు, తిరుమంజనములు, మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అంకురారోహణలు, ప్రదోష పూజలు, పుష్పార్చనలతో పాటు చిన్న పిల్లలతో భగవద్గీత పారాయణం, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

ఛావా చిత్రాన్ని నిలిపి వేయాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): మత విద్వేషాలను రెచ్చగొట్టే ఛావా సినిమా విడుదలను ఏపీలో నిలిపి వేయాలని కోరుతూ గురువారం ముస్లిం జేఏసీ నాయకులు మౌలానా అబ్దుల్లా రషాదీ, గౌరవాధ్యక్షుడు అబులైజ్, సద్దాంహుసేన్‌లు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించి సినిమా తీసి ముస్లింల మనోభావాలను దెబ్బ తీస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్‌కలాం, అన్సర్, మహమ్మద్ అలీ, మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ కార్యాలయంపై ఈడీ దాడులు సరికాదు

నంద్యాల(అర్బన్): ఎస్‌డీపీఐ కార్యాలయంపై ఈడీ దాడులు చేయడం సరి కాదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎస్‌డీపీఐ జాతీయ కార్యదర్శి అరెస్ట్‌ను నిరసిస్తూ ఢిల్లీలో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారన్నారు. అందుకు నంద్యాల ఎస్‌డీపీఐ కార్యాలయంపై ఈడీ దాడులు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన తెలపడం ప్రతి రాజకీయ పార్టీ హక్కు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం పనిగా పెట్టుకుందన్నారు.

12న వేలం పాటలు

నందికొట్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని సంత నిర్వహణ హక్కులకు ఈనెల 12న వేలం పాట నిర్వహించనునున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వారపు సంత, దిన కూరగాయాల మార్కెట్, బస్టాండ్ ఫీజు, జంతు వధశాల, మాంసం మార్కెట్‌లకు జైకిసాన్ పార్కులో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 11 గంటలకు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ దక్షయజ్ఞంపై ప్రవచనం వినిపించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): తాత్కాలిక ఆనందాల కోసం చెడుమార్గంలో వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి బెజవాడ రాధారాణి యువతకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 18సంవత్సరాల్లోపు పిల్లలను లైగింకి వేధింపులకు గురిచేసినా, బాధపెట్టినా కఠిన చట్టాలున్నాయన్నారు. పోక్సో చట్టం కింద అరెస్ట్ చేస్తారన్నారు. అలాగే విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం జడ్జిని కళాశాల నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, ప్రగతి, లలితాసరస్వతి, హిమబిందు, మురళీధర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

గోస్పాడు: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ రాజసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జిల్లెల్ల, యాళ్లూరు గ్రామాల్లో శాంతిభ్రదతలపై డ్రోన్ కెమెరా పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి ఒక్కరు గొడవలకు పోకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వరాదని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించి వాటిని పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో బహిరంగంగా మద్యం తాగడం, పేకాట ఆడటం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు ఏవైనా నిర్వహిస్తున్నారా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అన్న విషయాలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ వెంకటప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదను ధైర్యంతో ఎదురించాలి



ఆయుధాల పనితీరును వివరిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: ఏదైనా ఆపద ఎదురైతే మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని సీఐలు జయరామ్‌నాయుడు, రామాంజనేయరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినం వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎస్పీ కార్యాలయ ఆవరణలో విద్యార్థినులకు పోలీస్ ఆయుధాలను ప్రదర్శించి వాటి ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ పట్టణ శివారులోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు పోలీసు ఆయుధాలను చూపించి వాటిని ఎలా ఉపయోగిస్తామో వివరించామన్నారు. అలాగే జిల్లా ఎస్పీ కార్యాలయ సమీపంలో ఉన్న సైబర్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది విధులను తెలియజేశామని వెల్లడించారు. డీసీఆర్‌బీ విభాగంలో నేరాలకు సంబంధించిన సమాచారం భద్రపరిచే విధానం తదితర అంశాలను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. బేతంచెర్ల కోటపేట కాలనీకి చెందిన మీనిగ రేమేష్, మీనిగ మధు నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే ప్యాపిలి మండలం ఆలేబాద్‌తండా గ్రామానికి చెందిన మధావత్ భీముడు నాయక్ సారా అమ్ముతుండగా అరెస్టు చేశామని తెలిపారు. నిందితులు ముగ్గురి నుంచి 90లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా సారా తయారీ చేసినట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సారా రహిత గ్రామాలుగా మర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సీఐ లక్ష్మదాస్, ఎస్ఐలు రమేష్, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ ఉమాకాంత్‌రెడ్డి, బషీర్, గోపాల్, పాములేటి, రవికుమార్ సిబ్బంది ఉన్నారు.

రేపు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: ఎస్.కొంతలపాడు గ్రామంలో ఈ నెల 8వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని యాగంటీశ్వర స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీల్లో గెలుపొందిన జట్లకు తొలి ఆరు స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో మరమ్మతు పనులకు ఆమోదం



హెచ్‌డీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: చాగలమర్రిలోని పీహెచ్‌సీలో వివిధ మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు హెచ్‌ఈఎస్ అధ్యక్షుడు, ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. గురువారం పీహెచ్‌సీ డీడీఓ జగ దీష్ చంద్రారెడ్డి అధ్వర్యంలో అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షత వహించి మాట్లాడారు.పీహెచ్‌సీలో కిటికిలకు తలుపులు, మూత్ర శాలలు, తాగునీటి సౌకర్యం కల్పనకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. అంతకు ముందు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఎన్‌సీడీసీడీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు అంజలి, సూపర్వైజర్ శివరామలింగారెడ్డి, ముత్యాలపాడు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు,ఎంఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.